క్లుప్తంగా

మార్చి 8న జాతీయ లోక్ అదాలత్

నరసాపురం: పెండింగ్‌లో ఉన్న కేసుల పరిష్కారం కోసం మార్చి 8న జాతీయ లోక్ అదాలత్ నిర్వహిస్తున్నట్టు నరసాపురం పదో అదనపు జిల్లా జడ్జి పి.విజయదుర్గ తెలిపారు. ఈ మేరకు శనివారం ఆమె ఓ ప్రకటన విడుదల చేశారు. కక్షిదారులకు అవగాహన కల్పించి వీలైనన్ని ఎక్కువ కేసులు రాజీ అయ్యేలా చూడాలని పోలీసుశాఖ, న్యాయవాదులకు విజ్ఞప్తి చేశారు. రాజీ చేసుకోదగిన అన్ని రకాల కేసులు పరిష్కరించుకోవాలని సూచించారు.

ప్రమాదకరంగా డ్రెయిన్

నరసాపురం: పట్టణంలో రాజరాజేశ్వరి థియేటర్‌కు వెళ్లే దారిలో మలుపులో ఉన్న డ్రెయిన్ ప్రమాదకరంగా ఉంది. డ్రెయిన్‌పై మూతలు సవ్యంగా లేకపోవడంతో మలుపులో అటుగా వెళ్లేవారు ప్రమాదాలకు గురవుతున్నారు. పలు సినిమా హాళ్లు, ఆసుపత్రులు ఇటువైపు ఉండడంతో నిత్యం వందల మంది ఇటుగా ప్రయాణిస్తుంటారు. వారంతా భయపడుతూ అడుగులు వేయాల్సిన పరిస్థితి నెలకొని ఉంది. మున్సిపల్ అధికారులు ఈ అంశంపై దృష్టి పెట్టి సమస్యను పరిష్కరించాలని స్థానికులు కోరుతున్నారు.

సుబ్రహ్మణ్యేశ్వరుడికి సింహాసనం సమర్పణ



సుబ్రహ్మణ్యేశ్వర స్వామికి సింహాసనం అందజేస్తున్న దృశ్యం

పాలకొల్లు అర్బన్: పట్టణంలోని సుబ్బారాయుడు గుడి సెంటర్‌లో ఉన్న శ్రీవల్లీ దేవసేన సమేత శ్రీ సుబ్రహ్మణ్యేశ్వర స్వామికి ఆలయ కమిటీ సభ్యులు మోపిదేవి అప్పారావు నాయుడు దంపతులు, కుటుంబ సభ్యులు స్వాతి కార్తికేయ, గీతాంక్ష రూ.50 వేలు విలువైన సింహాసనం సమర్పించారు. భీష్మ ఏకాదశి రోజైన శనివారం స్వామివారికి సమర్పించి ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు గుణ్ణం విశ్వేశ్వరరావు, ఉపాధ్యక్షుడు యడ్ల నాగేశ్వరరావు, కార్యదర్శి గుమ్మళ్ల కిట్టయ్య తదితరులు పాల్గొన్నారు.

బాధిత విద్యార్థికి సాయం



రూ.10వేలు విరాళాన్ని బాధితుడి తండ్రి దుర్గారావుకి అందజేస్తున్న దృశ్యం

పాలకొల్లు అర్బన్: పట్టణంలోని జీవీఎస్‌వీఆర్‌ఎం మునిసిపల్ ప్రాథమిక పాఠశాలలో రెండో తరగతి చదువుతున్న ఎస్.కుశాల్ ఈశ్వర్ భోగి మంటల్లో పడి తీవ్ర గాయాల పాలై భీమవరంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. ఈ నేపథ్యంలో పాఠశాల హెచ్‌ఎం రాయపూడి భవానీ ప్రసాద్ ప్రోత్సాహంతో మానస సరోవర్ సొసైటీ తరపున రూ.10 వేలు విరాళాన్ని బాధిత విద్యార్థి తండ్రి దుర్గారావుకి శనివారం అందజేశారు. సంఘ సభ్యులు గుబ్బల భగవాన్, నేతల శ్రీనివాసరావు, ఖండవల్లి మోహన్‌రావు, మామిడిపల్లి అన్నప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా కొండాలమ్మ ఆలయ వార్షికోత్సవం



ప్రత్యేకాలంకరణలో కొండాలమ్మ

పెనుగొండ: స్థానిక నగరేశ్వర స్వామి కాలనీల్లో కొండాలమ్మ ఆలయం వార్షికోత్సవం శనివారం వైభవంగా నిర్వహించారు. ఉదయం నుంచి అమ్మవారికి పూజలు, కుంకుమార్చనలు నిర్వహించారు. మహిళలు కుంకుమార్చనల్లో వందలాదిగా పాల్గొన్నారు. అనంతరం ఆలయ ఆవరణలో భారీ అన్న సమారాధన నిర్వహించారు.

ముఖిదారమ్మ జాతర పనులు ప్రారంభం



జాతర బ్యానర్ కట్టి పనులు ప్రారంభిస్తున్న కమిటీ సభ్యులు

పాలకొల్లు అర్బన్: పట్టణంలోని అచ్చుగట్ల పాలెం ప్రాంతంలోని చిత్రాయిచెరువుగట్టున ఉన్న ముఖదారమ్మ వారి జాతర మహోత్సవాలు మార్చి 30 నుంచి ఏప్రిల్ 5వ తేదీ వరకు నిర్వహించనున్నారు. ఈ ఉత్సవాలకు సంబంధించి ఫ్లెక్సీని శనివారం శ్రీమారుతి థియేటర్ సెంటర్‌లో కట్టి పనులు ప్రారంభించారు. ఉత్సవ కమిటీ చైర్మన్ మండెల రజని, కమిటీ సభ్యులు ఉత్సవాల పనులు ప్రారంభ కార్యక్రమంలో పాల్గొన్నారు.

కళావిహీనంగా లేసు పార్కు



లేసుపార్కులో తుప్పు పట్టిన ఖరీదైన యంత్ర పరికరాలు



నిర్వహణ లేక మొక్కలు మొలిచిన దయ్యింగ్ మిషనరీ



కళావిహీనంగా ఉన్న లేసుపార్కు భవనం

- తుప్పుపట్టిన ఖరీదైన యంత్రాలు
- పట్టించుకోని పాలకులు

నరసాపురం రూరల్: తీరప్రాంతమైన నరసాపురం పేరు చెబితే గుర్తుకు ఎంతో మన్నికైన లేసు అల్లికలు. వీటికి అంతర్జాతీయంగా గుర్తింపు ఉంది. లేసు అల్లికలపై ఆధారపడి వేలాది మంది మహిళలు ఉపాధి పొందేవారు. ఇంతటి ఘన చరిత్ర కలిగిన లేసులకు గతంలో ముఖ్యమంత్రిగా పనిచేసిన డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి హయాంలో నరసాపురం మండలం రుస్తుంబాద- సీతారామపురం గ్రామాల మధ్య అలంకృతి లేసు భవనాలను ఏర్పాటు చేసి అప్పటి డీఆర్‌డీఏ ఆధ్వర్యంలో ఈ లేసు పార్కు పనిచేసే విధంగా ఒక వ్యవస్థను ఏర్పాటు చేశారు. చాలాకాలం ఈ లేసు పార్కు ద్వారా వేలాది మంది లేసు అల్లికా మహిళలకు శిక్షణతో కూడిన ఉపాధి పొందేందుకు ట్రైనింగ్‌లు నిర్వహించారు.

30 వేల మందికి ఉపాధి

నరసాపురం, మొగల్తూరు, యలమంచిలి, పాలకొల్లు, పోడూరు, వీరవాసరం, ఆచంట తదితర మండలాలలో సుమారు 30 వేల మంది లేసు అల్లికా మహిళలు సభ్యులుగా చేరారు. అప్పట్లో లేసుపార్కు సభ్యులకు, వీరి కుటుంబ సభ్యులకూ ప్రతీ ఏటా ఆరోగ్య బీమా సౌకర్యాన్ని కల్పించారు. వీరంతా (లేసు అల్లికా మహిళలు) వ్యయ ప్రయాసలు పడి నరసాపురం లేసు పార్కుకు రావాల్సిన అవసరం లేకుండా కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల నిధులతో ప్రతి మండలంలోనూ లేసు అల్లికా మహిళల సౌకర్యార్థం భవనాలను నిర్మించారు. ప్రస్తుతం వీటిపై అజమాయిషీ లేకపోవడంతో ఆ భవనాలు నిరుపయోగంగా మారాయి.

పాలకవర్గం లేకపోవడంతో ఇబ్బందులు

జిల్లా కలెక్టర్ ఆధ్వర్యంలోని అధికార యంత్రాంగంతో పాటు లేసుపార్కు నిర్వహణ కోసం గ్రామ, మండలస్థాయిల్లో సొసైటీల ద్వారా ఎన్నికలు నిర్వహించి అనంతం లేసుపార్కు పాలకవర్గాన్ని ఎన్నుకునే వారు. ఆయా సభ్యులు జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో జరిగే ఎగ్జిబిషన్లకు ఈ లేసు పార్కు నుంచి వెళ్లి లేసు ఎగుమతులకు సంబంధించిన ఆర్డర్లు పొందేవారు. అంతేకాకుండా నరసాపురం పరిసర ప్రాంతాల లేసు ఎగుమతిదారులు వారి ఉత్పత్తులను ఉతకడం, ఎక్స్‌పోర్టు తదితర పనుల కోసం లేసు పార్కులో లక్షలాది రూపాయలను వెచ్చింది యంత్రాలను ఏర్పాటు చేశారు. తదుపరి కాలంలో ఎస్సీ, బీసీ గురుకులాల విద్యార్థుల యూనిఫాంలు కుట్టేందుకు లేసు పార్కు ఆర్డర్లు తీసుకుని ఆ పని పూర్తి చేసేది. ఫలితంగా ఆదయాన్ని సమకూర్చుకున్న రోజులు ఉన్నాయి. అయితే గ్రామ, మండల స్థాయిలో లేసుసార్కు పరిధిలోని సొసైటీలకు ఎన్నికలు జరిగిప్పటికీ లేసు పార్కు పాలకవర్గాన్ని ఎన్నుకోవడం లేదా ఎంపిక చేసుకోవడం కోసం ఇప్పటికే ఐదుసార్లు ఎన్నికలు వాయిదా పడ్డాయి.

చిట్టడవిలా పరిసరాలు

నరసాపురం లేసుపార్కుకు ఒక మేనేజర్ పోస్టుతో పాటు, ఒక డిజైనర్, సేల్స్ అమ్మకాల కోసం కొంతర్లను కూడా ఏర్పాటు చేశారు. ప్రత్యక్షంగా పది మంది, పరోక్షంగా మరికొంత మంది ఉద్యోగులు లేసుపార్కు సమర్థవంత నిర్వాహణ కోసం పని చేసేవారు. 24 గంటల పాటు విధులు నిర్వహించే కాపలా దారులు జీతాల బకాయిలు పేరుకు పోవడంతో విధులకు హాజరు కావడం లేదు. దీంతో లేసుపార్కు తెరచి ఉందో, మూసి ఉందో తెలియని పరిస్థితి నెలకొంది. లేసుపార్కు ఆవరణ చిట్టడవిలా మారింది. భవనాలు కళావిహీనంగా తయారయ్యాయి. పార్కులోని భారీ యంత్రాలు తుప్పుపట్టాయి. వాస్తు పేరుతో లేసు పార్కులో ఈశాన్యం మూలన ఉన్న భారీ మామిడి వృక్షాన్ని తొలగించారు. ఈ స్థానంలో 216 హైవే పక్కనే లేసుపార్కు ఉన్నందున లేసు ఎగ్జిబిషన్ కం సేల్స్ ఏర్పాటుకు షాపులు నిర్మిస్తామని సెర్ప్ జిల్లా అధికారులు చెప్పిన మాట అమలుకు నోచుకోలేదు.

మాటలకే పరిమితం

అయితే ఇటీవల నరసాపురం లేసులకు భౌగోళిక గుర్తింపు పొందడంతో జిల్లా అధికారులు, ప్రజా ప్రతినిధులు బోలెడన్ని గొప్పలు చెప్పారు. లేసులకు, లేసు పార్కుకు పూర్వ వైభవం తెస్తామని, కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు లేసు అల్లికా మహిళల అభివృద్ధికి కృషి చేస్తాయని వాగ్దానాలు చేశారు. అయితే ఆయా వాగ్దానాలు మాటలకే పరిమితమయ్యాయి. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి లేసుపార్కును తిరిగి వినియోగంలోకి తెచ్చేలా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

రథోత్సవంలో అపశృతి



ఆచంటలో డ్రెయినేజీలోకి ఒరిగిన రథం

పెనుగొండ: భీష్మ ఏకాదశి సందర్భంగా ఆచంటలో శనివారం నిర్వహించిన రథోత్సవంలో అపశృతి చోటు చేసుకుంది. రథచక్ర సీల విరిగిపోవడంతో వెళ్తున్న రథం అదుపు తప్పి డ్రెయినేజీలోకి ఒరిగిపోయింది. ఎలాంటి ప్రమాదం జరగకపోవడంతో ఊపిరి పీల్చుకున్నారు. అనంతరం రథాన్ని పైకి లాగి రథోత్సవం యథావిధిగా కొనసాగించారు. శ్రీదేవి భూదేవి సమేత వేంకటేశ్వర స్వామి అంతర్వేద ఏకాదశి పురస్కరించుకొని స్వామివారి కల్యాణ మహోత్సవం వైభవంగా నిర్వహించారు. మధ్యాహ్నం స్వామి వారిని రథంపై ఊరేగించారు. రథోత్సవ కార్యక్రమంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఆచంట ఎస్సై కె.వెంకటరమణ ఆధ్వర్యంలో పోలీసు బందోబస్తు నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ కార్య నిర్వహణ అధికారి ఆదిమూల వెంకట సత్యనారాయణ, ఉత్సాహ కమిటీ చైర్మన్ నంబూరు విజయ్, మేక చిన్నబ్బులు తదితరులు పాల్గొన్నారు

మినీ గోకులాల బిల్లుల కోసం ఎదురుచూపులు

నిర్మించి నెలలు గడుస్తున్నా పట్టించుకోని వైనం



దొడ్డిపట్లలో నిర్మించిన మినీ గోకులం షెడ్డు

యలమంచిలి: మినీ గోకులం పథకంలో షెడ్డు నిర్మించుకున్న లబ్ధిదారులు రాయితీ సొమ్ము కోసం ఎదురుచూస్తున్నారు. పల్లెల్లో పాడి పరిశ్రమ అభివృద్ధికి పశు సంవర్ధక శాఖ, జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం అధికారుల ఆధ్వర్యంలో సంయుక్తంగా మినీ గోకులాల పేరిట షెడ్ల నిర్మాణం ప్రారంభించారు. 10 శాతం రైతు వాటాతో పశువులకు షెడ్డులు నిర్మించుకుంటే మిగిలిన 90 శాతం రాయితీ రూపంలో వచ్చే నగదును మీ బ్యాంకు ఖాతాలకు 15 రోజుల్లో జమచేస్తామని అధికారులు పాడి రైతులకు చెప్పి ఆగమేఘాల మీద షెడ్లు నిర్మింపజేశారు.

మండలానికి 50 షెడ్లు

మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం నిధులతో రాష్ట్ర ప్రభుత్వం గోకులం పథకం పేరుతో పాడి రైతులకు పాడి, పశుపోషణ షెడ్ల నిర్మాణానికి శ్రీకారం చుట్టింది. ఈ పథకంలో యలమంచిలి మండలానికి 50 షెడ్లు కేటాయించారు. ఉపాధి ఏపీఓ, ఎంపీడీఓ, పశు సంవర్ధకశాఖ ఏడీ, పశు వైద్యాధికారి, వెలుగు ఏపీఎంతో కూడిన కమిటీ లబ్ధిదారులను ఎంపిక చేయాలి. అయితే వీటిని పూర్తిగా కూటమి ప్రజాప్రతినిధుల సిఫార్సుల మేరకే మంజూరు చేశారనే విమర్శలు ఉన్నాయి. కొన్ని గ్రామాలలో రైతుల వద్ద కూటమి నాయకులు డబ్బులు తీసుకుని ఈ షెడ్లు మంజూరు చేశారనే ఆరోపణలు కూడా ఉన్నాయి.

హడావుడిగా పూర్తి చేయించిన అధికారులు

గోకులం కింద జత పశువులకు సంబంధించిన షెడ్డుకు రూ.1.15 లక్షలు, 4 పశువులు షెడ్డుకు రూ.1.85 లక్షలు, 6 పశువుల షెడ్డుకు రూ.2.30 లక్షల చొప్పున వస్తాయని షెడ్డు నిర్మాణం మొదలు పెట్టించారు. లబ్ధిదారులు అధికంగా ఆరు పశువుల సామర్థ్యం ఉన్న షెడ్లనే నిర్మించారు. ఇందులో రైతు 10 శాతం ఖర్చు చేయాల్సి ఉంది. మిగిలిన 90 శాతం షెడ్డు నిర్మాణ దశలో ఉండగానే మూడు దశల్లో బిల్లులు లబ్ధిదారుని బ్యాంకు ఖాతాలో జమ చేయాలి.

మూడు నెలలైనా మంజూరు కాని రాయితీ

గోకులం షెడ్లు మంజూరైన లబ్ధిదారులు నిర్మాణ పనులను అక్టోబరు, నవంబరు నెలల్లో మెదలు పెట్టి రెండు వారాల్లో పూర్తి చేశారు. ఉపాధి హామీ సిబ్బంది హడావుడి చేసి లబ్ధిదారులతో షెడ్లను పూర్తి చేయించారు. ఈ విధంగా యలమంచిలి మండలంలో సుమారు 11 షెడ్ల నిర్మాణం పూర్తయ్యింది. షెడ్ల నిర్మాణం పూర్తయ్యి మూడు నెలలు అవుతున్నా ఒక్క రూపాయి కూడా జమ కాలేదు. లబ్ధిదారులు ఉపాధి హామీ సిబ్బంది అడుగుతుంటే బిల్లులన్నీ అప్ లోడ్ చేశామని ఒక్కసారే బిల్లంతా వస్తుందని చెబుతున్నారే కానీ డబ్బులు మాత్రం జమ కావడం లేదని లబ్ధిదారులు వాపోతున్నారు.

అప్పులకు వడ్డీలు కడుతూ...

మినీ గోకులాల నిర్మాణం పూర్తి చేస్తే 15 రోజుల్లో లబ్ధిదారుల ఖాతాల్లో రాయితీ సొమ్ము జమ అవుతుందని అధికారులు రైతులకు హామీ ఇచ్చారు. కానీ మూడు నెలలవుతున్నా ప్రభుత్వం ఇంత వరకు సొమ్ము వారి ఖాతాల్లో జమ చేయకపోవడంతో లబ్ధిదారులు ఆవేదనకు గురవుతున్నారు. అప్పులు చేసి ఈ షెడ్డులు నిర్మించామని, ఇప్పుడు వాటికి వడ్డీలు కడుతున్నామని రైతులు ఆవేదన చెందుతున్నారు. పాడి రైతులు రాయితీ నగదు జమ కాక కార్యాలయాల చుట్టూ తిరిగినా పరిష్కారం లభించక తీవ్ర అసహనం వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం తమకు అప్పగించిన లక్ష్యాన్ని అధిగమించేందుకు రెండు శాఖల అధికారులు ఈ నిర్మాణాలు పూర్తి చేయించి చేతులు దులుపేసుకున్నారని మండిపడుతున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం పాడి రైతులకు చెల్లించాల్సిన రాయితీ నగదును వెంటనే చెల్లించాలని కోరుతున్నారు.

ఉగ్ర నరసింహుని అలంకరణలో వెంకన్న



ఉగ్ర నరసింహస్వామిగా వేములదీవి వెంకన్న

నరసాపురం రూరల్: మండలంలోని వేములదీవి కాపులకొడప వెంకటేశ్వరస్వామిని శనివారం ఉగ్ర నరసింహస్వామి రూపంలో ప్రత్యేకంగా అలంకరించారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు పెద్దింటి అరుణ్‌కుమార్ ఆచార్యులు స్వామి వారికి విశేష సేవలు, అభిషేకాలు, పూజలు నిర్వహించారు. అనంతరం సాయంత్రం ఆలయ ప్రాంగణంలో భజన కార్యక్రమం చేశారు.

మోషేన్‌రాజును కలసిన వినిస్టన్‌బాబు



మోషేన్‌రాజుకు పుష్పగుచ్ఛం ఇస్తున్న వినిస్టన్‌బాబు

పాలకొల్లు అర్బన్: వైఎస్సార్ సీపీ క్రిస్టియన్ మైనార్టీ సెల్ జిల్లా అధ్యక్షుడుగా నియమితులైన కుంచిలపల్లి వినిస్టన్‌బాబు శనివారం భీమవరంలో శాసన మండలి చైర్మన్ కొయ్యే మోషేన్‌రాజుని మర్యాదపూర్వకంగా కలిశారు. అలాగే డీసీఎంఎస్ మాజీ చైర్మన్ యడ్ల తాతాజీ, వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకులు గుణ్ణం నాగబాబులను కలిశారు. ఆయనతో పాటు వైస్ ఎంపీపీ పడవల సునీల్‌బాబు, వైఎస్సార్ సీపీ మండల గౌరవాధ్యక్షుడు ఎం మైఖేల్‌రాజు, మండల కోఆప్షన్ సభ్యుడు తండా ఇస్సాక్ రాజు, మాజీ ఎంపీపీటీసీ కర్రి జోగయ్య, పానుకుమట్ల వీరాస్వామి ఉన్నారు.

ఎమ్మెల్సీ ఎన్నికల్లో గెలిపిస్తే సమస్యల పరిష్కారానికి కృషి

భీమవరం: అసెంబ్లీలో కూటమి పార్టీల ఎమ్మెల్యేల సంఖ్య అధికంగా ఉన్నా ప్రజా సమస్యలు ప్రస్తావనకు రావడం లేదని పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో తనను గెలిపిస్తే ప్రజాగళం వినిపించి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని బొమ్మిడి సన్నీరాజ్ చెప్పారు. శనివారం భీమవరంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఉభయ గోదావరి జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో తాను స్వతంత్ర అభ్యర్థిగా పోటీలో ఉన్నానన్నారు. ఈ ఎన్నికల్లో అధికార కూటమి పార్టీలు బలపర్చిన అభ్యర్థిని గెలిపించడం వల్ల ప్రజలకు ఎటువంటి ప్రయోజనం ఉండదన్నారు. నిరుద్యోగుల సమస్యల పరిష్కారానికి శాసనమండలిలో గళమెత్తే వ్యక్తి అవసరం ఎంతో ఉందన్నారు. అధికార పార్టీకి వంతపాడే ఎమ్మెల్సీ కంటే ప్రజా సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లే నాయకుడు ఉండాలన్నారు. తనను ఎమ్మెల్సీగా గెలిపిస్తే అన్ని రంగాల్లో సంస్కరణలు తీసుకువచ్చే విధంగా కృషిచేస్తానని సన్నీరాజ్ స్పష్టం చేశారు. ఈ సమావేశంలో బొమ్మిడి నారాయణరావు, ఆకుల తేజ, బి వెంకటేశ్వరరావు, కె లక్ష్మి, కొడవలి దుర్గారావు పాల్గొన్నారు.

లేబర్ కోడ్‌లను రద్దు చేయాలి

తణుకు అర్బన్: కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ పేద ప్రజలకు వ్యతిరేకంగాను, కార్పొరేట్లకు అనుకూలంగా ఉందని సీఐటీయూ జిల్లా కార్యదర్శి పీవీ.ప్రతాప్ విమర్శించారు. శనివారం స్థానిక బ్యాంక్ కాలనీలో సీఐటీయూ ఆధ్వర్యంలో బడ్జెట్ ప్రతులను దగ్ధం చేసి నిరసన తెలిపారు. పేదలపై భారాలు వేసే బడ్జెట్ వ్యతిరేకించండి, లేబర్ కోడ్స్ రద్దు చేయాలని, కార్మికులకు కనీస వేతనం రూ.26వేలు అమలు చేయాలని, రైతు వ్యతిరేక చట్టాలు రద్దు చేయాలని, స్వామినాథన్ కమిషన్ సిఫార్సులు అమలు చేయాలని, సంక్షేమ పథకాలకు నిధులు పెంచాలని పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. ఈ సందర్భంగా ప్రతాప్ మాట్లాడుతూ మోదీ ప్రభుత్వం మూడోసారి అధికారంలోకి వచ్చినా ఎప్పటి మాదిరిగానే ఈ బడ్జెట్ కూడా కార్పొరేట్లకు అనుకూలంగా ఉందని విమర్శించారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు గార రంగారావు, గుబ్బల గోపి, శ్రీనివాస్, బాబు, మురళి, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

మార్చి 15 నుంచి నాటిక పోటీలు



పాలకొల్లు కళాపరిషత్ నాటిక పోటీల కరపత్రం విడుదల చేస్తున్న సంస్థ సభ్యులు

పాలకొల్లు అర్బన్: పంచారామ క్షేత్రంగా ప్రసిద్ధి చెందిన పాలకొల్లులో నాటక పరిషత్‌లు గత ఆరు దశాబ్దాలుగా నాటిక పోటీలు నిర్వహిస్తూ నాటక రంగానికి ఎనలేని సేవలు అందించాయని కళా పరిషత్ అధ్యక్షుడు కేవీ కృష్ణవర్మ అన్నారు. పాలకొల్లు కళా పరిషత్ నాటిక పోటీలు మార్చి 15, 16, 17 తేదీల్లో నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. ఈ పోటీలకు సంబంధించిన కరపత్రాన్ని శనివారం విడుదల చేశారు. నాటిక పోటీలు బస్టాండ్ సెంటర్‌లో అడబాల థియేటర్స్ వెనుక ఖాళీ స్థలంలో ప్రత్యేక వేదిక ఏర్పాటు చేసి నిర్వహిస్తున్నామని వివరించారు. ఆవిష్కరించిన కరపత్రాలను మొదటగా కళాపరిషత్ గౌరవ అధ్యక్షుడు మేడికొండ శ్రీనివాస చౌదరి, ఉపాధ్యక్షుడు డా.కేఎస్‌పీఎన్ వర్మకు అందజేశారు. కళా పరిషత్ తరఫున గత 16 సంవత్సరాలుగా నాటిక పోటీలు నిర్వహిస్తున్నామని, దీనికి సహకరిస్తున్న దాతలకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. సంస్థ ప్రధాన కార్యదర్శి మానేపల్లి సత్యనారాయణ, కార్యదర్శి జక్కంపూడి కుమార్, కోశాధికారి కొణిజేటి గుప్త, షేక్ పీర్ సాహెబ్, నడపన శ్రీనివాసరావు, జీఎస్ఎన్ రవి, రెడ్డి వాసు, సోమంతి శ్రీనివాసశాస్త్రి తదితరులు పాల్గొన్నారు.

శ్రీ క్షీరారామలింగేశ్వరునికి సిద్ధమవుతున్న పాగా



పాగా నేస్తున్న వరదా సోమేశ్వరరావు

పాలకొల్లు అర్బన్: పంచారామ క్షేత్రంగా ప్రసిద్ధి చెందిన శ్రీ క్షీరారామలింగేశ్వర స్వామికి శివరాత్రి రోజున లింగోద్భవ సమయంలో గర్భ గుడి శిఖరం నుంచి గాలిగోపురం శిఖరం వరకు పాగా కట్టడం ఆనవాయితీ. ఈ పాగాను పాలకొల్లు మండలం దగ్గులూరు గ్రామానికి చెందిన వరదా సోమేశ్వరరావు కుటుంబ సభ్యులు ప్రత్యేక మగ్గంపై నేస్తారు. ఈ ఏడాది పాగా కట్టేందుకు సోమేశ్వరరావు ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నారు. 361 మూరలు పాగా నేస్తారు. ఇప్పటివరకు సుమారు 260 మూరలు పాగా నేశారు. కార్తీక మాసం ప్రారంభం రోజు నుంచి ఈ పాగా నేయడం మొదలు పెడతారు. పాగా పూర్తయిన వెంటనే గ్రామోత్సవం నిర్వహించి స్వామివారికి అలంకరిస్తామని సోమేశ్వరరావు తెలిపారు.

శివరాత్రి పనులు ప్రారంభం

ఉండి: ఈ నెల 26న జరిగే మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని ఉండి రాజులపేట శివాయంలో పనులు ప్రారంభించినట్లు ఎంపీపీ ఇందుకూరి శ్రీహరి నారాయణరాజు తెలిపారు. శనివారం రాజులపేటలోని పార్వతీసమేత మల్లికార్జున స్వామి ఆలయంలో వేదపండితుడు,శివరాత్రి ఉత్సవ ఆర్గనైజర్ ఎస్.చలతపతిరావు వేదమంత్రాల నడుమ పందిరి రాట నాటి పనులను ప్రారంభించారు.

రేపు పాఠశాలల్లో నులిపురుగుల నివారణ మాత్రల పంపిణీ

నరసాపురం: జాతీయ నులిపురుగుల నివారణ కార్యక్రమంలో భాగంగా సోమవారం పట్టణంలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లోనూ, అంగన్‌వడీ కేంద్రాల్లో విద్యార్థులకు నులిపురుగుల నివారణ మాత్రల పంపిణీ చేస్తామని మున్సిపల్ కమిషనర్ ఎం.అంజయ్య తెలిపారు. ఈ మేరకు శనివారం ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. పిల్లలందరికీ మాత్రల పంపిణీ చేయాలని ఇప్పటికే ఆయా పాఠశాలలకు ఆదేశాలు ఇచ్చామని పేర్కొన్నారు.

విద్యాసామగ్రి పంపిణీ

నరసాపురం రూరల్: ప్రతి ఒక్కరూ సేవాభావాన్ని కలిగి అలవర్చుకోవాలని పసలదీవి సర్పంచ్ కొట్టు రామాంజనేయులు అన్నారు. విశ్రాంత హెచ్ఎం గుంపుల రాజారత్నం వర్ధంతిని సందర్భంగా వారి కుటుంబ సభ్యులు సెవెన్ ఆలివ్స్ ఫౌండేషన్ ట్రస్ట్ ఆధ్వర్యంలో విద్యార్థులకు విద్యాసామగ్రి పంపిణీ చేశారు. పసలదీవి మండలపరిషత్ స్కూల్, యలమంచిలి మండలం పెనుమర్రు మండలపరిషత్ పాఠశాలల విద్యార్థులు సుమారు 300కి విద్యాసామగ్రిని పంపిణీ చేశారు. పసలదీవి గ్రామంలో 50 మంది మహిళలకు దుస్తులను అందించారు. కార్యక్రమంలో వసంత్, రీటా, గ్రేస్, విలియమ్స్, సంజయ్ తదితరులు పాల్గొన్నారు.

ఆకు కూరలతో సంపూర్ణ ఆరోగ్యం



అంగన్‌వాడీ కేంద్రంలో మొక్కలు నాటుతున్న సీడీపీఓ సీహెచ్ ఇందిర

పాలకొల్లు అర్బన్: గర్భిణులు, బాలింతలు ఎక్కువగా ఆకుకూరలతో వండి భోజనం తింటే రక్తహీనత సమస్యలు రావని ఐసీడీఎస్ సీడీపీఓ సీహెచ్ ఇందిర అన్నారు. పాలకొల్లు మండలం పెదమామిడిపల్లి అంగన్‌వాడీ కేంద్రంలో శనివారం గర్భిణులు, బాలింతలకు ఆకుకూరల వల్ల కలిగే ప్రయోజనాలు వివరించారు. కిచెన్ గార్డెన్‌ను పరిశీలించి మొక్కలు నాటారు. అనంతరం సేంద్రీయ విధానంలో సాగు చేసిన ఆకు కూరలను గర్భిణులకు, బాలింతలకు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ ఎస్ఎస్ మల్లేశ్వరి, ఏఎన్ఎం ఎం.సుధారాణి, అంగన్‌వాడీ వర్కర్ జి.నాగజ్యోతి తదితరులు పాల్గొన్నారు.

వడలిలో ప్రమాదం.. మహిళకు గాయాలు

పెనుగొండ: వడలిలో జరిగిన రోడ్డు ప్రమాదంలో మహిళకు స్వల్ప గాయాలయ్యాయి. తెలంగాణ నుంచి వచ్చి వడలిలో మారుతీ వ్యాన్‌పై ఆయుర్వేద మందులు అమ్ముకుంటుండగా, కడియపు లంక వెళుతున్న వాహనం ఢీకొనడంతో కాలుకు గాయమైంది. దీంతో 108లో హుటాహుటిన తణుకు ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

మార్టేరులో ఘనంగా శాంతి కల్యాణం



ప్రత్యేకాలంకరణలో వేంకటేశ్వర స్వామి

పెనుమంట్ర: మాఘ మాసం భీష్మ ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకుని శనివారం ఉదయం మార్టేరు గ్రామంలోని శ్రీ లక్ష్మీ వరాహ నరసింహ స్వామి, శ్రీదేవి భూదేవి సమేత శ్రీ వేంకటేశ్వర స్వామి శాంతి కల్యాణ మహోత్సవాలు ఘనంగా నిర్వహించారు. ఆలయ అర్చకులు శ్రీనివాసుల వెంకటాచార్యులు, వెంకటేశ్వర్లు బ్రహ్మత్వంలో శుక్రవారం రాత్రి కల్యాణ మహోత్సవం నిర్వహించారు. శనివారం ఉదయం స్వామివార్లకు పంచామృత, క్షీరాభిషేకలు, అమ్మవారికి కుంకుమార్చనలు నిర్వహించారు. అనంతరం తులసి దళార్చన, పుష్పాలంకరణ చేశారు. ఆలయ కమిటీ అధ్యక్షుడు వెలగల చిన్నబాబు, గాదె రామనాథం తదితరులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.